ప్రజాశక్తి
శుక్రవారం 24 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

జలపాతాల పరవళ్లు



రాజుపాక జలపాతం

ప్రజాశక్తి-అనంతగిరి : దట్టమైన అటవీ ప్రాంతంలో ఎత్తైన గిరి శిఖరాల నుంచి ఒంపుల సొంపులతో జలజల జాలువారుతూ, పరవళ్లు తొక్కుతూ నేలకు ఉరుకుతున్న జలపాతాలు ప్రకృతి ప్రేమికులను, సందర్శకులను విశేషంగా అలరిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాల ఉరుకులు పరుగులు కనువిందు చేస్తున్నాయి. బొర్రా పంచాయతీలో కటికి, అనంతగిరిలో తాడిగుడ. రాజుపాక, బిసొరంగనీ, టోకూరులోని చిట్టంపాడు. జీనాబాడులో సరియా, పెదకోటలో కుడియా, పెదబయలు, లుంగపర్తిలో పులుసుమామిడి జలపాతాలు అలరిస్తున్నాయి. బొర్రా గుహలు, అరకు తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు అ జలపాతాలను సందర్శిస్తూ, అక్కడి అందాలను ఆస్వాదిస్తూ, పాలనురగలా జాలువారుతున్న జలపాతాల్లో పిల్లాపాపలతో కేరింతలు కొడుతూ సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

పశువుల పాకలాంటి షెడ్‌లో

ఇంకెన్నాళ్లీ చదువులు

- ఇప్పటికైనా పక్కా భవనం నిర్మించాలి
- కుముడుపుట్టు పాఠశాల విద్యార్థుల వేడుకోలు

మొరపెట్టుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: పశువుల పాకలాంటి షెడ్‌లో ఇంకెన్నాళ్లు పాఠాలు నేర్చుకోవాలని మండలంలోని మారుమూల కుమడ పంచాయతీ, కిముడు పుట్టు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకు తమ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించారని, ఇపుడు పక్కా భవనం నిర్మించి వసతి కష్టాలకు విముక్తి కల్పించాలని విద్యార్థులంతా చేతులు జోడించి వేడుకున్నారు. గురువారం ఎస్ఎంసి చైర్మన్ కొర్ర అభిషేక్ ఆధ్వర్యంలో పాఠశాల భవనానినికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు .

గ్రామ పెద్దలు కొర్ర జోగ్గు, కోర్ర రామచంద్ర, వంతల రామచంద్ర తెలిపిన వివరాల ప్రకారం, కుముడుపుట్టు గ్రామంలో పివిటిజి పోర్జ, గౌడు కులాలకు చెందిన 60 కుటుంబాలు నివాసముంటున్నాయి. గిరిజన సంక్షేమశాఖ యాజమాన్యంలో నిర్వహిస్తున్న కుముడుపుట్టు జిపిఎస్‌లో 37 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం లేక సుమారు పదేళ్లుగా గ్రామస్తులు నిర్మించిన రేకుల షెడ్‌లో అవస్థలు మధ్య విద్యాబోధన సాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కూల్చి నూతన పాఠశాల భవన నిర్మాణం చేస్తామని ప్రభుత్వ అధికారులు ఆదేశాల మేర ధ్వంసం చేసిన పాఠశాల భవనాన్ని నిర్మాణాలు చేపట్టలేదని వాపోతున్నారు.

ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో 37 మంది పిల్లలు ఉన్నారని, ఇప్పటివరకు ఉపాధ్యాయుల కొరత ఉండగా, ఇటీవల మెగా డిఎస్‌సిలో కొత్త ఉపాధ్యాయుడిని నియమించడంపై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, తాము చదువుకునేందుకు బడి భవనం లేకపోవడంపై ఆవేదన చెందుతున్నాయి. పశువుల పాక కన్నా అధ్వానంగా ఉన్న షెడ్‌లో విద్యాబోధనకు తాము పడుతున్న అవస్థలపై ఇన్నాళ్లు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారి స్పందించి, పాఠశాల భవన నిర్మాణాల నిధులు కేటాయింపు కొరకు ఉన్నత అధికారులకు నివేదించాలని కోరారు. లేకుంటే, విద్యార్థులు, తల్లిదండ్రులతో మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నూతన కార్యవర్గం

సమావేశమైన ఎస్ఎఫ్ఐ నేతలు, నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఎస్ఎఫ్ఐ అరకులోయ మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గురువారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్‌ఓ నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా టి ప్రేమ్ సాగర్, ఉపాధ్యక్షులుగా పి భీమరాజు, పి రామకృష్ణ ,కార్యదర్శిగా ఎస్.ఐసుబాబు సహాయ కార్యదర్శి జి దావీదు, కె గోపాల్ కమిటి సభ్యులు పి చిట్టిబాబు, బాలు, కృష్ణ, మధు, వర్మ, అభి, చరణ్, టి రామ్‌చరణ్, వి అశోక్, వి తిరుపతి,జి నాగేష్ కె ప్రశాంత్, పి శ్రీను, కె అనిల్ కుమార్ తదితర 20 మంది కమిటీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి రామన్న మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నిరంతరం అధ్యయనం చేసి భవిష్యత్ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాత భవనం శిథిలావస్థకు చేరిందని, తక్షణమే నూతనంగా భవన నిర్మాణానికి నిధులు మంజూరు డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంచి నీరు, మరుగు దొడ్ల సదుపాయాలు కల్పించాలని, మహిళ వసతి గృహం రక్షణ గోడలు నిర్మాణం చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలోని విద్యా సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జ్యోతిప్రజ్వళనతో యువజనోత్సవాన్ని పారంభిస్తున్న ఐటిడిఎ పిఒ శ్రీపూజ

నేర్చుకునేతత్వం అలవడాలి

- యువజనోత్సవంలో ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు/ పాడేరు టౌన్: మానసికోత్సాహం, నేర్చుకోగలిగే తత్వం ప్రతిఒక్కరికీ అవసరమని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ఇన్‌ఛార్జి జెసి తిరుమణి శ్రీపూజ అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, మెదడుకు పదును, శరీర ఆరోగ్యం కోసం ఆటలు, నడక, నృత్యం తప్పనిసరిగా ఉండాలన్నారు.ఏదైనా కొత్తగావిషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే నిత్యం చురుకుగా ఉండగలమన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. బాగా చదువుకొని ఉద్యోగంలో లేదా వ్యాపారంలో స్థిరపడకపోతే ప్రయోజనం ఉండదన్నారు. సోమరితనం మంచిది కాదన్నారు.విద్యార్థులు ఎప్పుడూ మంచి అలవాట్లపై ఉత్సాహంగా ఉండాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని, భావి పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ కవిత, ఇతర అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు చేస్తున్న గిరిజనులు

వర్షాలకు కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి హుకుంపేట: మండలంలోని చీకుమధుల పంచాయతీ నుంచి గుమ్మడిగుంట మీదుగా డల్లపల్లి వరకు ఉన్న గ్రావెల్ రోడ్డుకు వర్షాల కారణంగా పూర్తిగా పాడైంది. వర్షాలకు రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతోపాటు పెద్ద నందిపుట్టు గ్రామం వద్ద గుంతలు ఏర్పడ్డాయి. భారీగా రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీనిపై అనేకసార్లు ఆందోళన చేయడంతోపాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ఎట్టకేలకు గ్రామస్తులే స్పందించి గురువారం శ్రమదానంతో రహదారి గోతులను పూడ్చారు. మహిళలు, పురుషులు, యువత ఇలా గ్రామస్తులంతా కదలివచ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఏ చిన్న అవసరం వచ్చినా గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే తాము పడుతున్న కష్టాలపై ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. తాము చేపట్టిన మరమ్మతులు తాత్కాలిక మేనని, చీకుమదుల, డల్లాపల్లి మధ్య తారు రోడ్డు నిర్మాణంతో తమ రహదారి, రాకపోకల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పిహెచ్‌సి సందర్శనలో డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్

బాలికను పరీక్షిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ :మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ డి కృష్ణమూర్తి నాయక్ గురువారంఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణపై సిబ్బంది అడిగి తెలుసు కున్నారు. అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విధులకు హాజరుకాని పారా మెడికల్ ఆప్తాల్మిక్ అధికారి, యం.పి.హెచ్ఇ ఓ హాజరు పట్టికలో సంతకం చేయకపోవడంతో వారిని మందలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ కేటాయించిన బాధ్యతలు విధిగా నిర్వర్తించాలని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిహెచ్‌సికి వైద్యం కోసం వచ్చే రోగులకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కొందరికి స్వయంగా వైద్యసేవలు అందించారు. పిహెచ్‌సిలో సుఖ ప్రసవాలు అధికంగా జరుపుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేసారు. ప్రసవం పొందిన బాలింతలతో మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత,, వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. కాన్పు అనంతరం రెండు రోజులు సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలని, తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించిన అనంతరం తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం సహాయంతో వారి గ్రామానికి తరలించాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటి సందర్శనలు గూర్చి, అందిస్తున్న వైద్య సేవల గూర్చి రోగులకు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్.సిలో ఉన్న ప్రసవ నిరీక్షణ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులతో ముచ్చటించారు. అన్ని వార్డులను, ప్రసూతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్ పరీక్షలపై ఆరా తీశారు. ఫార్మసీని తనిఖీ చేసి అందుబాటులో ఉన్న మందులు, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు.

డిఎంఒ కార్యాలయ సందర్శన

పాడేరు: జిల్లా మలేరియా అధికారి కార్యాలయాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ డి కృష్ణమూర్తి నాయక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తులసితో భేటీ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు పిహెచ్‌సిల వారిగా నమోదైన మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే పాడేరు డివిజన్‌లో మూడు, రంపచోడవరంలో 9, చింతూరు డివిజన్‌లో ఆరు పిహెచ్‌సిల పరిధిలో ఎక్కువగా మలేరియా కేసులు నమోదైనట్లు గుర్తించారు. మలేరియా కేసులకు అందించిన రాడికల్ ట్రీట్మెంట్ (ఆర్.టి) చికిత్స వివరాలు, మాస్ కాంటాక్ట్, యాంటీ లార్వా ఆపరేషన్స్, పాగింగ్ చర్యల వివరాలను రిపోర్టు రూపంలో అందజేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా నివారణ చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

చిరస్మరణీయుడు పూనెం సత్యనారాయణ

- ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం



వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న లోకనాథం తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం

సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ పూనెం సత్యనారాయణ చిరస్మరణీయుడని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. అమరజీవి కామేడ్ పూనెం సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద స్మారక స్తూపాన్ని గురువారం లోకనాథం ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు జెండా ఆవిష్కరణ చేశారు. రేఖపల్లి జంక్షన్ నుండి సిపిఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సభలో లోకనాథం మాట్లాడారు. ఈ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి, సున్నం రాజయ్య తరువాత సత్యనారాయణ మంచి పేరు పొందారని తెలిపారు. సత్యనారాయణ మృతి పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాతం కోసం ఎర్రజెండా చేతపట్టి చిన్నప్పుడే ప్రజాక్షేత్రంలో దూకిన ధీరుడు సత్యనారాయణ అని కొనియాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కొరకు అనేక పోరాటాలు నిర్వహించారని, ఆయన మనకు దూరం అవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ మాట్లాడుతూ సత్యనారాయణ మరణం పార్టీతో పాటు వ్యక్తిగతంగా తనకు తీరనిలోటని తెలిపారు. తనను రాజకీయంగా ప్రోత్సహించారన్నారు. అందరితో స్నేహభావంతో ఉండేవారని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, కాక అర్జున్, మడకం నాగమణి, బాబు బొర్రయ్య, సోయం చినబాబు, సత్యనారాయణ భార్య, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, కుమారులు ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, కిరణ్ కుమార్, ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్‌లు సవలం మారయ్య, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ, సున్నం రాజయ్య కుటుంబసభ్యులు చుక్కమ్మ, చంద్రరావు, లక్ష్మి, శిరమయ్య కుటుంబసభ్యులు, తెలంగాణ సిపిఐ నాయకురాలు సీతామహాలక్ష్మి, మహిళా సంఘం జిల్లా నాయకురాలు పద్మ, రంగమ్మ, రాజేశ్వరి, పిఎన్‌యం నాయకులు ఐవి, ఆసు లక్ష్మయ్య, అచ్యుతరావు, సుబ్బారావు, వైసిపి నాయకులు పొడియం గోపాల్, పిట్ట రామారావు, టిడిపి నాయకులు ముత్యాల రామారావు, ఆచంట శ్రీనివాస్, బొర్రా నరసింహారావు, బీరక సూర్యప్రకాష్, కాంగ్రెస్ నాయకులు లీలాకృష్ణ, సర్వరాజ్, సిపిఎం మండల నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ సిలబస్ త్వరితగతిన పూర్తి చేయాలి

మాట్లాడుతున్న ఎస్ఎస్‌సి పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పదవ తరగతి విద్యార్థులకు త్వరితగతిన సిలబస్ పూర్తి చేయాలని ఎస్ఎస్‌సి పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ అన్నారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ పాఠశాల, స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, భర్ణగూడెం ఆశ్రమ పాఠశాలలను, ఎంఈఓ కార్యాలయాన్ని గురువారం శశి కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఏ విధంగా ఉన్నది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశి కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఫలితాలను బట్టి ఈ సంవత్సరం మరింత మంచి ఫలితాలు తేవాలని బీ, సీ గ్రేడ్ పిల్లలు 100శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏపీ ఓపెన్ స్కూల్ కరపత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి యాదగిరిశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి సూరయ్య రెడ్డి, ఏపీఎం సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గిరిజన బాలుని మృతిపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : సీతానగరం మండలం నాగంపల్లి గ్రామం వద్ద ఉన్న సిఆర్‌బీ క్రాషర్‌లో పనిచేసే జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గిరిజన బాలుడు గుమా సుండి (17) పోలవరం ఇరిగేషన్ లెఫ్ట్ కెనాల్ కాలువలో పడి మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ ఎం.వాణిశ్రీ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇతపల్లి సిరిమళ్ళి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బాలుడు మృతిపైనా, పోలీసులు వ్యవహరించిన తీరుపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బాలుడి మృతిపై పోలీసులు గోప్యంగా పోస్టుమార్టం నిర్వహించడాన్ని వారు ప్రశ్నించారు. తల్లి, తండ్రులు లేకుండా పోస్టుమార్టం ఎలా జరిపారని వారు సందేహం వ్యక్తం చేశారు. కుటుంబానికి కేవలం ఒక లక్ష రూపాయలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరైంది కాదని వాపోయారు. ఈ ఘటనపై జ్యూడీషియల్ ఎంక్వైరీ జరపాలని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై లేబర్ కమిషనర్, జిల్లా కలెక్టర్, మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదులు చేస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత వాణిశ్రీ

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ బ్రహ్మాజీరావు

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-గంగవరం : విద్యా ప్రమాణాలు పెంపునకు ఉపాధ్యాయుల కృషి చేయాలని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక మోడల్ ప్రైమరీ పాఠశాలను గురువారం డిఇఒ ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల ఆన్లైన్ హాజరును, భౌతిక హాజరు తనిఖీ చేశారు. టిఎఆర్ఎల్ అమలు చేస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఎఫ్ఏ2 పరీక్షలకు సంబందించిన మూల్యాంకన పుస్తకాలను తనిఖీ చేశారు. 1 నుండి 4వ తరగతుల విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. అక్టోబర్ నెలలో పెండింగ్‌లో ఉన్న వర్క్‌బుక్ ఖాళీలు, కరెక్షన్స్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి తరగతిని క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేసి విద్యార్థులకు మరింత సమర్ధవంతంగా, నాణ్యమైన, మెరుగైన బోధన చెయ్యాలని సూచించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడ్ని ప్రభుత్వం నియమించిందని, నాణ్యమైన బోధన చేయలేకపోతే ప్రభుత్వ బడులపై సమాజానికి నమ్మకం పోతుందని పేర్కొన్నారు. సెలవులో ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడ్ని ఫోన్ ద్వారా పాఠశాల నిర్వహణ గురించి తెలుసుకొని, మరింత మెరుగ్గ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణ, ఉపాధ్యాయులు కె బాపనమ్మ, కె.లావణ్య, సిఎంఆర్‌పి భాస్కర్, ఎంఐఎస్ కోర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

కొమ్మిక రహదారి బురదమయం

బురదమయంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కొమ్మిక గ్రామానికి వెళ్లే రహదారి అత్యంత దారుణంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి మొత్తం బురదమయంగా మారింద. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి, వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురదలో ద్విచక్ర వాహనాలు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు రహదారికి మరమ్మతు పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రంలోని ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రాజేంద్రపాలెం పిహెచ్సి ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థికి మలేరియా, వివిధ రకాల పరీక్షలు చేస్తున్నట్టు వైద్యాధికారి తెలిపారు. వర్షాలు, వాతావరణకు మార్పుల వలన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం డి.నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గిరిజన ప్రాంత సమస్యలపై పల్లాతో గిడ్డి చర్చ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును విశాఖలో గురువారం పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, గిరిజన ప్రాంత అభివృద్ధి, హైవే నిర్మాణం, గ్రామాల కనెక్టివిటీ రహదారులు, తాగునీరు, పెన్షన్‌లు, పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇరువురూ చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకునేందుకు నవంబర్ 5 వరకు గడువు పెంచేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా ఈశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. భారీ వర్షాల కారణంగా గిరిజన ప్రాంతంలోని దెబ్బతిన్న అనేక రోడ్ల నిర్మాణాలను తక్షణం చేపట్టాలని కోరారు.

28న వైసిపి ప్రజా ఉద్యమానికి రండి

ప్రజాశక్తి పాడేరు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 28న వైసిపి తలపెట్టిన ప్రజా ఉద్యమం పోస్టర్లను గురువారం పాడేరులో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28న ఆందోళనకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, నాయకులు సీదరి రాంబాబు, పాంగి పరుశురాం, కిముడు శివరత్నం, చెట్టి అన్నా రోషిణి, కూతంగి సూరిబాబు, సీదరి మంగ్లన్న దొరా, కూడా సురేష్ కుమార్, రేగం చాణక్య, కమ్మిడి అశోక్ పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో టిడిపి నేతల తనిఖీ

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా కేంద్రం పాడేరులోని మద్యం దుకాణాల్లో క్యూఆర్ కోడ్ తో మద్యం అమ్ముతున్నారా? లేదా? అన్న విషయంపై స్థానిక టిడిపి నేతలు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు డప్పోడి వెంకటరమణ మద్యం షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసిన తరువాతే మద్యం బాటిల్ అమ్మాలని దుకాణదారులకు సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఒకరికి మూడు బాటిళ్లకు మించి అమ్మ రాదన్నారు. మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం విక్రయిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు.

ఎట్టకేలకు నీటి బావి శుభ్రం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- హుకుంపేట: మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న బావిని హుకుంపేట పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం శుభ్రపరిచారు. బీజింగ్ పౌడర్‌ను బకెట్లలో కలిపి బావిలో కలిపి శుద్ధి చేశారు.'చెత్త చెదారంతో బావి'శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు స్పందనగా పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి సిద్ధంగాఉన్నామన్నారు. వీధిదీపాలు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలకు సంబంధించిన సమాచారాన్నిస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

తహశీల్దార్‌గా భాస్కర అప్పారావు

ప్రజాశక్తి ముంచింగిపుట్టు:: నూతన తహశీల్దారుగా ఎం. భాస్కర అప్పారావు గురువారం విధుల్లో చేరారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న తహసిల్దార్ శంకరరావు చింతపల్లి బదిలీపై వెళ్లారు. ఎం భాస్కరఅప్పారావు సెలవుల్లో ఉండి గురువారం విధుల్లో చేరినట్లు ఆయన తెలిపారు. ప్రజల నేరుగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పాడేరు :స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు, క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం ముగిసాయి. ఈ పోటీల్లో ఎంపిక అయినా విద్యార్థిని విద్యార్థులను ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పాంగి.సూరిబాబు, ఆధ్వర్యంలోక్రీడ పోటీలలో మాజీ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి మండలం కొండబాబు అల్లూరి జిల్లా పిఈటి పీడీల అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ భూపతి రాజు, చందర్‌రావు సద్దు ప్రెసిడెంట్ సింహాచలం, పిఇటి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

ఆందోళన కొనసాగించిన ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు

ఆసుపత్రి వద్ద సమ్మె శిబిరంలో పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని సంఘం గౌరవ అధ్యక్షులు, సిఐటియు నాయకులు ఎల్.సుందరరావు అన్నారు. పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఆసుపత్రి వద్ద బైఠాయించి రోజంతా నిరసన కొనసాగించారు. గురువారం రెండో రోజు టెంట్ కింద సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ 20 రోజుల క్రితం సమస్యలపై ఆసుపత్రి సూపరింటిండెంట్‌కు వినతి పత్రం అందజేసినా కనీస స్పందన లేదన్నారు. 2024లో ఇచ్చిన జిఓ మేరకు రూ.18,600 వేతనం చెల్లించాలన్నారు. బకాయిలు విడుదల చేయడంతో పాటు డ్యూటీ చార్ట్, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ, ఎఫ్‌ఆర్‌ఎస్, గ్రూప్ ఇన్సూరెన్స్, షిఫ్ట్ డ్యూటీలు, రెస్ట్ రూమ్స్, జీతంతో కూడిన 9 జాతీయ సెలవులు, పని పరికరాలు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ముత్యాలమ్మ, పుణ్యవతి, రత్నాలమ్మ, సుజాత, రాజేశ్వరి, భూషణ్, చిట్టిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమ్మె రెండో రోజు గురువారం కొనసాగింది. సిఐటియు మండల కార్యదర్శి కె శంకరరావు మాట్లాడుతూ ఆసుపత్రులశానిటేషన్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వీడి, వారి న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ఎస్ గాసిరాం, వి కౌసల్య, కె సుబ్బలక్ష్మి, ఎస్ చిట్టిబాబు, బి కాశీనాథ్, కే దేవి, ఎస్.మచ్చి, కొండబాబు, కె దాసన్న, కె.వసంత, ఎస్ సత్యలమ్మ పాల్గొన్నారు .

చింతపల్లి : ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పాత కాంట్రాక్టర్ నుంచి రావాల్సిన జీతాలు, పీఎఫ్ బకాయిలువెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. రెండోరోజు పారిశుధ్య కార్మికుల సమ్మెశిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమస్య పరిష్కరించే వరకు సమ్మె విరమించరని స్పష్టం చేశారు. శుక్రవారం పాడేరులో పాత కాంట్రాక్టర్‌తో చర్చలు జరగనున్న నేపథ్యంలో పెండింగ్ జీతాలు, పీఎఫ్ సమస్య పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో. మండల సిఐటియు కన్వీనర్. మోర్రి వెంకటగిరి. యూనియన్ నాయకులు ఈశ్వరరావు, రామారావు, గిరిబాబు, రాములమ్మ, గున్నమ్మ, గంగమ్మ, సింహాచలం పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,కనీసవేతనం రూ 26 చెల్లించాలని అరకులోయ ఏరియా ఆసుపత్రి వద్ద కార్మికులు సమ్మె గురువారం రెండోవ రోజు కొనసాగుతుంది. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్మికులు చేపట్టిన సమ్మె కు సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు పాల్గొని మద్దతు తెలిపారు..కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు బాలన్న, రాము, వరహాలమ్మ, ద్రౌపతి, సుమిత్ర, కపా, కోటి, కుమారి, బురుంద కార్మికులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-జి మాడుగుల : జిల్లాలో పెట్రోల్ బంకుల కార్మికుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదనిఅల్లూరి జిల్లా పెట్రోల్ బంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్ అన్నారు. గురువారం జి.మాడుగుల పెట్రోల్ బంక్ కార్మికులను కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏళ్ల తరబడి ఐటిడిఎ, జిసిసి పెట్రోల్ బంకులలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచటం లేదన్నారు. కాంటాక్ట్ కార్మికులకు వేతన పెంపు జిఓను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలన్నారు. ఐటిడిఎ బంకులలో 12 గంటల పాటు కార్మికులతో పనిచేయిస్తూ వారి శ్రమను దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. బంక్‌లలో సరిపడా కార్మికులను నియమించకుండా ఉన్నవారిపై పనిభారం పెట్టడం దుర్మార్గమన్నారు. పెట్రోల్‌బంక్ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. వేతనాలతో కూడిన సెలవు దినాలు మంజూరు చేయాలని కోరారు. జిసిసి బంక్‌లలో పనిచేస్తున్న కార్మికులు శ్రీమాంబ మేన్ పవర్ ఏజెన్సీ ఆధ్వర్యంలో థర్డ్‌పార్టీ ఉద్యోగులుగా ఉన్నారని, ఆ ఏజెన్సీని రద్దు చేసి వారినీ జిసిసి .కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు శివ శంకర్, ఉపాధ్యక్షులు మత్స్యరాజు, యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, మాధవి పాల్గొన్నారు.

కల్తీ డీజిల్ వ్యవహారంపై నిలదీత

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక జిసిసి పెట్రోల్ బంక్‌లో కల్తీ డీజిల్ సరఫరాపై వారం రోజులుగా మోటార్ యూనియన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గురువారం జిసిసి డివిజనల్ జనరల్ మేనేజర్ కృష్ణ ప్రసాద్ తన బృందంతో వచ్చి హుకుంపేట జిసిసి పెట్రోల్ బంకును సందర్శించి, పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, ఓనర్లు పైడిరాజు, నాగేశ్వరరావు, కామేష్ మాట్లాడుతూ ఆరు రోజులుగా వాహనాలు నిలిచి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కల్తీ డీజిల్ వల్ల తమ వాహనాలకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆరోపణలు వచ్చినప్పుడు పైపైనే చూసి వెళ్లిపోవడం సరికాదని, సమస్యపై ప్రజలకు వాహనదారులకు స్పష్టతనివ్వడంతోపాటు ఇటువంటివి పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు చేపడతారో వివరించాలని నిలదీశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, కల్తీ డీజిల్ వ్యవహారంపై వాస్తవాలు వెల్లడించి తగు చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గసబ పంచాయతీ, మొర్రిగుడ గ్రామంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై బాలల సంరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ ఎస్ అశోక్ కుమార్ అధ్యక్షతన గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో గసబ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పాంగి సునీత మాట్లాడుతూ, బాల్య వివాహాలు జరగకుండా అందరు బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రతి ఆడ బిడ్డ చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. మహిళలు, ఆడ పిల్లలపై రోజురోజుకూ లైంగిక వేధింపులు పెరిగిపోతున్న నేపథ్యంలో వారికున్న చట్టాలను పటిష్టంగా అమలు చేయడంతోపాటు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గసబ మహిళపోలిసు కె గాయత్రి, మొర్రిగుడ పాఠశాల ప్రాధనోపాధ్యాయులు,ఏఎన్ఎం రత్న కుమారి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి -జి. మాడుగుల : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తూరు సమీపంలో ఎపిటిడబ్ల్యు జూనియర్ కాలేజీని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు సందర్శించారు. అక్కడ విద్యార్థులకు గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు విద్యార్థులు ఉన్నత చదువును అభ్యసించాలన్నారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు

పరీక్షల సన్నద్ధతపై సమీక్ష

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి ఎస్. భీమశంకరరావు గురువారం సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న యూనిట్-2 పరీక్షలు, ప్రయోగాల నిర్వహణ, అలాగే రాబోయే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా (ప్రాక్టికల్స్, థియరీ) పరీక్షలకు అవసరమైన సదుపాయాలు, వసతులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, విద్యార్థుల చదువులో మరింత శ్రద్ధ వహించి, రాబోయే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కాలేజీలో రెగ్యులర్ తరగతులతోపాటు స్టడీ హవర్స్ నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్ కె. గోవిందరావుకు ఆదేశించారు. డిఐఇఓ సూచనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ కె. గోవిందరావు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-జి మాడుగుల: మండలంలోని మద్దిగరువు లోకల్ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ నాలుగేళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఉపాధి కోసం భీమవరం చెరువుల్లో పనికి వలస వెళ్లిన బొయితిలి పంచాయతీ గొందిపల్లి గ్రామానికి చెందిన బుటరీ సంజీవరావు హఠాన్మరణం చెందిన విషయం తెలుసుకున్న గ్రూపు సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఇంటిపెద్దదిక్కు మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబానికి చేతనైన ఆర్థికసాయం అందించడంతోపాటు మున్ముందు ఎటువంటి అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఫ్రెండ్‌షిప్ గ్రూపు సభ్యులు మానవత, సేవాభావాన్ని పలువురు ప్రశంసించారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీ జర్రెల పొదోర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని గురువారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజేశ్వరి, కొండమ్మ తనిఖీకి వెళ్లారు. అంగన్వాడి లబ్ధిదారులతో పాటు గ్రామ ప్రజలు, కిశోర బాలికలతో మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవాలని, బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. గర్భిణులు, బాలింతలు తరచూ ఆసుపత్రుల్లో వెళ్లి తనిఖీలు చేయించుకోవాలన్నారు. కిశోర బాలికలకు విద్యాభ్యాసంపై అవగాహన పరచారు. ప్రీ స్కూల్లో నమోదైన చిన్నారులకు అంగన్వాడి ప్రాథమిక విద్య నేర్చుకునేందుకు కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు.

27న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై అవగాహన

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు : ఈనెల 27న సోమవారం అల్లూరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు అరకువాలీ, హుకుంపేట మండలాల్లో పంపు స్టోరేజ్ ప్రాజెక్టుపై ఎన్ఆర్ఈడిసి ఏపి లిమిటెడ్ తాడేపల్లి ఎమ్‌డి, టెక్నికల్ బృందం వారితో పంపు స్టోరేజ్ ప్రాజెక్టుపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజలు ఈ అవకాశం వినియోగించుకో వలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

సచివాలయ సిబ్బంది వివరాల సేకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామ సచివాలయాల్లో సిబ్బంది లేక పనులు నిలిచిపోవడంతో సిబ్బంది ఎంతమంది ఉన్నారు అన్న విషయంపై వివరాలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో జిడివి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం రాజేంద్రపాలెం సచివాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో సిబ్బంది వివరాలు సేకరించి పైఅధికారులకు పంపిస్తామని తెలిపారు.

పీసా ఎన్నికలకు అధికారుల నియామకం

వివిధ కారణాలతో నిలిచిన కొయ్యూరు మండలం రేవళ్ల, రాజేంద్రపాలెంలో పీసా కమిటీ ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహణకు చర్యలు చేపట్టామని ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు గురువారం తెలిపారు. రేవళ్లకు ఎన్నికల అధికారిగా రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ గోపాలం, రాజేంద్రపాలెంకు ఏఎస్ఓ చైతన్యను ఎన్నికల అధికారిగా నియమించినట్లు చెప్పారు.

బాపనమ్మ మృతిపై హెచ్‌ఆర్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఇటీవల కోటం బాపనమ్మ అనే గర్భిణి ప్రసవ సమయంలో మృతి చెందడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన బాపనమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బాపనమ్మ భర్త నుండి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - రంపచోడవరం : 11కెవి ఫీడర్, 33 కెవి మారేడుమిల్లి ఫీడర్, 11 కెవి ఇందుకూరుపేట ఫీడర్‌లో మెయింటినెన్స్ భాగంగా లైన్ల మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ పనులు కారణంగా శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా రంపచోడవరం, సిరిగిందలపాడు, మారేడుమిల్లి మండలాల పరిసర ప్రాంతాలకు, దేవీపట్నం మండలం శరభవరం, నేలకోట, రామన్నపాలెం, గోందూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరంచాలని ఆయన కోరారు.

రఘురామ్‌కు సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల తహసీల్దార్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న గంపల రఘురామ్ (27) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల నాయకులు రఘురామ్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ధైర్యం నింపి కుటుంబం సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కార్యవర్గ సభ్యులు కారం సుందరయ్య, నాయకులు సిరపు తాతబాబు పాల్గొన్నారు.

బదిలీ సిఐకి సన్మానం

ప్రజాశక్తి-జీకే.వీధి : స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై విశాఖ సిటీకి వెళ్తున్న వరప్రసాద్‌కు స్టేషన్ ఎస్సై కే.సురేష్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై కే సురేష్ మాట్లాడుతూ ప్రజలతో నిత్యం ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి చొరవచూపించారని తెలిపారు. సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ సిఐగా బాధ్యతలు తీసుకున్నాక తనపై ఆఫీసర్లు అందించిన తోడ్పాటు సహాయ సహకారాలు అన్ని రకాల ఉపయోగపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దారు హెచ్.అన్నాజీరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం ఆర్టీవో రాజేష్ అన్నారు. మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి వంటి ప్రాంతాల్లో గురువారం ఆర్టీవో వాహనాలు తనిఖీ చేపట్టారు. రాజవొమ్మంగి- జడ్డంగి ప్రధాన రహదారిపై వచ్చి పోయే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రంగా లేని ఎనిమిది వాహనాలకు రూ.86వేలు అపరాద రుసుము విధించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

మావోయిస్టుల బంద్ పిలుపుతో..

పోలీసుల అప్రమత్తం

పలు చోట్ల విస్తృతంగా తనిఖీలు

మోతుగూడెంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మోతుగూడెం : మావోయిస్టు పార్టీ ఈ నెల 24న బంద్‌కు పిలుపు ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పలు చోట్ల గురువారం తనిఖీలు చేపట్టారు. చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో మోతుగూడెం ఎస్సై ఎస్‌కే సాదిక్ తన సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాహనాలు నిలిపి వాహన రికార్డును, ప్రయాణికులు లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్-42 బెటాలియన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

కొయ్యూరు : 24న మావోయిస్టులు దేశవ్యాప్త బంద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ, మంప ఎస్సై శంకరరావుతో కలిసి సీఐ శ్రీనివాసరావు స్టేషన్ ఎదుట వాహన తనిఖీలు నిర్వహించారు. బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారమందించాలని ప్రజలను కోరారు.

ముంచింగిపుట్టు : ఆపరేషన్ కగార్‌కు నిరసనగా మావోయిస్టు కేంద్ర కమిటీ పిలుపుతో 24న దేశవ్యాప్త బంద్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలోని ప్రజాప్రతినిధులుపోలీస్ అనుమతి లేకుండా మారుమూల ప్రాంతాలకు వెళ్ళరాదనీ స్థానిక ఎస్సై జె రామకృష్ణ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీలు నిర్వహించి అనుమానిత వ్యక్తులు సమాచారం సేకరిస్తున్నామన్నారు. బంద్ నేతత్వంలో అనుమానాస్పద వ్యక్తులపై నిఘాపెట్టామన్నారు.

జి.మాడుగుల: ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఈనెల 24న శుక్రవారం మావోయిస్టులు భారత్ బంద్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు గురువారం స్థానిక సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు మండల కేంద్రంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారురికార్డులు సక్రమంగా లేని వాహనదారులపై చర్యలు తీసుకున్నామన్నారు. అనుమానితులను విచారించి విడిచిపెట్టారు

ప్రజా ప్రతినిధులు లోతట్టు గ్రామాలకు వెళ్ళవద్దు

రాజవొమ్మంగి : మావోయిస్టుల దేశవ్యాప్త బంద్ పిలుపు నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన నేతలు శుక్రవారం మారుమూల గ్రామాలకు వెళ్లవద్దని రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరికీ, జడ్డింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురికి నోటీసులు ఇవ్వటం జరిగిందని ఎస్ఐ తెలిపారు. పోలీసులకు తెలియకుండా ముఖ్యనేతలు మారుమూల పల్లెలకు వెళ్లరాదని సూసించారు.

కొయ్యూరు జెడ్‌పిటిసి హత్య కేసులో

ఏడుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట: కొయ్యూరు జెడ్‌పిటిసి వారా నూకరాజు హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి తెలిపారు. గురువారం రోలుగుంట పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, ఈనెల 20నఉదయం 11 గంటలకు కొయ్యూరు జెడ్‌పిటిసి వారా నూకరాజు కొనుగోలు చేసిన సర్వే నెంబరు 139లోని 10.83ఎకరాల భూమిలో కూలీలతో వెళ్లి తుప్పలు తొలగించే పనులను పరిశీలించేందుకు వెళ్లగా, ప్రత్యర్థి వర్గం కేదారి రాజుబాబు, వారి బంధువులు పథకం ప్రకారం పొలంలోనే కర్రలు, కత్తులతో దాడికి యత్నించగా, అక్కడున్న వారంతా పారిపోగా, వారంతా నూకరాజును చుట్టుముట్టి దాడి చేయగా కరాజు పొలంలోనే రక్త గాయాలై మృతి చెందారన్నారు. నూకరాజుతో పాటు వచ్చిన మాస లోవరాజు అనే వ్యక్తిపై కూడా దాడి చేయగా అతని చేతికి గాయమైందన్నారు. అందిన సమాచారం మేరకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రోలుగుంట పోలీసులు, సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. అన్ని సాక్ష్యాలను సేకరించిభూతగాదాలు కారణంగా పథకం ప్రకారమే నూకరాజును హత్య చేసినట్టు నిర్ధారించారు. బుధవారం మధ్యాహ్నం కళ్లాలు పాకలు వద్ద సంచరిస్తున్న నిందితులను కొత్తకోట, రోలుగుంట ఎస్ఐలు సిబ్బందితో వెళ్లి అదుపులో తీసుకొని అరెస్టు చేశారన్నారు.

అరెస్టు అయిన వారిలో కేదారి రాజుబాబు, నీలాపు అప్పలనాయుడు, నీలాపు లక్ష్మణరావు, నీలాపు అప్పలనాయుడు, నీలాపు యరకన్న, కేదారి రాజేశ్వరి, ఈదెల రాజేశ్వరి ఉన్నారన్నారు. కేసును మరింత లోతుగా విచారిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు పాల్గొన్నారు.

మినుము, పెసర విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రం రేకపల్లి ఏవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి చేతుల మీదుగా రైతులకు మినుము, పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వర్షాలు వరదలు రావటవల్ల ఇప్పటికే దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సర్పంచ్ వేట్టి లక్ష్మి, కారం బుచ్చుమ్మ, ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు, వ్యవసాయశాఖ సిబ్బంది నాగు పాల్గొన్నారు.

ఐ పోలవరం పార్కులో పర్యటిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీ పర్యాటక ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం పర్యటక ప్రాంతాన్ని గురువారం ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో మైదాన ప్రాంతం నుండి వచ్చే పర్యాటకులు కాలువల్లో స్థానాలకు దిగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం వేయకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటక ప్రాంతానికి వచ్చినవారు తిరిగి వారి వారి గ్రామాలకు క్షేమంగా వెళ్లే విధంగా సాధ్యమైనంత వరకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట ఎపీఎం జి.కిషోర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - జీకే.వీధి : మండలంలోని రింతాడ గ్రామంలో గురువారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వరప్రసాద్, ఎస్సై సురేష్ మాట్లాడుతూ ప్రమాదాలు నివారించడానికి రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. బైక్ ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడప రాదని, పొగమంచు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అదనపు జాగ్రత్తలు తీసుకొని వాహనాలను నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు బొబ్బిలి వెంకట్రావు, గోపి, గ్రామ పెద్దలు, మహిళలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రైతులు ప్రతి సర్వే నెంబర్‌లో ఈ - పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి చక్రధర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను గురువారం ఎఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో 22,108 సర్వే నెంబర్లు ఉన్నాయని, ఇప్పటి వరకు 11,206 సర్వే నెంబర్లు క్రాప్ బుకింగ్‌లో కవర్ చేయడం జరిగిందని తెలిపారు. రైతులు విచ్చలవిడిగా పంటలపై రసాయనిక ఎరువులు వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని వాతంగి పంచాయితీలో ఆశ్రమ బాలికొన్నత పాఠశాల, అంగన్వాడీ సెంటర్ వద్ద గురువారం పారిశుధ్య కార్యక్రమం, ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.సుబ్బలక్ష్మి, ఉపసర్పంచ్ ఆర్.అర్జున్, సచివాలయ సెక్రటరీ శ్రీనివాస్, హెచ్‌ఎం దుర్గ భవాని, వార్డెన్ కన్నయమ్మ, పిడి ఆదియ్య, అంగన్వాడీ వర్కర్ కాంతం, ఆశా వర్కర్ చంద్రకళ, విఆర్‌ఓ వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని ఫోక్స్‌పేట పంచాయతీ పరిధి దేవరాతిగూడెం ప్రాథమిక పాఠశాలను కారం సురేష్ బాబు గురువారం సందర్శించి పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రతను, ముఖ్యంగా బాత్‌రూమ్‌ల శుభ్రతను పరిశీలించారు. తరువాత విద్యార్థులతో సంభాషించి ఇప్పటివరకు బోధించిన ఐదు పాఠాలపై విద్యార్థులకు ప్రశ్నలు అడిగి, టీచర్ సహాయంతో బోర్డుపై లెక్కలు రాయించి, విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే వారి పిల్లల విద్య అత్యంత కీలకమని అన్నారు.